# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి

## అన్నపూర్ణ కావిడి



సంజెవేళ!

ఇల్లాళ్ళ పనులు ముగించుకుని, స్నానాలుచేసి, వాకిటి గడపల్లో కూర్చుని ముచ్చటలాడు కుంటున్న వేళ! సాయం సంధ్యలో స్వామి దర్శనం చేసుకుని జనం గుడినించి తిరిగి వెళ్తున్న వేళ!

వీధి చివర చిరుగంటల మోత! ఆ వెంటనే ''మాతా అన్నపూర్ణేశ్వరీ'' అన్న పెద్ద కేక. పిల్లలంతా ఆ కేక వచ్చిన వైపు, ఆ గంటల మోతవైపు పరుగెత్తారు. శరభయ్య అన్నపూర్ణ కావిడితో ఇంటింటికీ వస్తున్నాడు. శరభయ్య అరవయ్యేళ్ళ వృద్ధు. బవిరి గడ్డం. ఆ గడ్డం వెనకాతల నవ్వుతున్న పెదవులు, ముడతల ముఖంలో వెలుగుతున్న కళ్ళు, నుదుట మూడు పాయలుగా తెల్లని విభూతి, ఆ విభూతి చారల మధ్య సాయం సూర్యుడిలా పెద్ద కుంకం బొట్టు. చేతులకి, ఛాతీకి కర్మబంధాలు కట్టి పడేసినట్టు పెద్ద పెద్ద విభూతి పాయలు. చిరిగి పోయినా శుభ్రమైన పట్టుబట్ట కట్టాడు శరభయ్య. భుజాన అన్నపూర్ణ కావిడిని అటూ ఇటూ మారు స్తుంటే కావిడికున్న గంటలు ఘల్లు ఘల్లున మోగుతున్నాయి.

ఆ యిత్తడి కావిడి నిగనిగ మెరుస్తోంది. శుభ్రంగా తోమిన ఆ కావిడికి విభూతి, కుంకం బొట్లు పెట్టాడు. కావిడి కిరుప్రక్కలా వేలాడుతోన్న గొలుసులు, ఆ గొలుసులకు చిన్న గంగాళాల్లా గిన్నెలు. ఇంటింటి ముందు ఆగి ఒక గిన్నెలో అన్నం, మరో గిన్నెలో కూరలు వేయించుకుంటున్నాడు శరభయ్య. ''మాతాన్నపూర్ణే శ్వరి'' అని తప్ప వేరు మాట అనడు. అదే పిలుపు. అన్నం పెట్టిన తర్వాత అదే ఆశీర్వచనం. ఆ పిలుపు విని అన్నం పెట్టని ఇల్లాలుండదు. ఏ యిల్లాలైనా వాకిట వుంటే పక్కింటి వాళ్ళని పిలిచి అన్నం పెట్టిస్తుంది. శరభయ్యతో పాటే పిల్లలంతా ఆ వీధి దాటి వెళ్ళేదాకా ఆ అన్నపూర్ణ కావిడిని, 'మాతాన్నపూర్ణేశ్వరి' కేకను, వూగుతూ మోగుతున్న గంటల్ని చూస్తూ వెంట నడుస్తారు. శరభయ్య వీధి దాటి వెళ్ళేం తర్వాత అందరూ గోలగా 'మాతాన్నపూర్ణేశ్వరి' అని గోలగా అరుచుకుంటూ ఎవరిళ్ళకు వాళ్లు వెళ్తారు.

శరభయ్య వీధులన్నీ తిరిగి గాలిగోపురం దగ్గరి కొచ్చేసరికి అక్కడికి కుంటీ, గుడ్డీ బిచ్చగాళ్ళంతా చేరుకుంటారు. తను తెచ్చిన అన్నం కూరలు వాళ్ళకు పెట్టి, మిగిలింది తను తిని, మిగలకపోతే కృష్ణాజలం తాగి 'శంభో' అనుకుంటూ పొద్దుపోయేదాకా ఏక్‌తారా మీటు కుంటూ తత్వాలు పాడుతూ నిద్రపోతాడు.

గతం తెలిసిన వాళ్ళు శరభయ్యేమిటి? ఈ అన్నపూర్ణ కావిడేవిటి? ఈ వైరాగ్యమేమిటి? అని ఆశ్చర్యపోతారు. శరభయ్య వయసులో వుండగా, అమ్మా, నాన్న శాంతమ్మని చేసుకోమని చెప్తే, నల్లగావున్న శాంతమ్మని కాదని ఎర్రగా వున్న కాంతమ్మని చేసికొన్నాడు. కాంతమ్మ కాపురానికొచ్చిన అర్నెల్లలో అత్తమామల్ని అరుగుల మీదికి తోలింది. పోనీ కట్టుకున్న మొగుణ్ణే కళ్ళలో బెట్టుకు చూసిందందామా అంటే అదీ లేదు. శరభయ్యని నుంచోనిచ్చేది కాదు, కూర్చోనిచ్చేది కాదు. తిండి సమంగా పెట్టేది కాదు, పెట్టిన తిండి తిననిచ్చేది కాదు. ఉక్కిరిబిక్కిరై పోయేవాడు శరభయ్య. రాత్రయ్యేటప్పటికి కాంతమ్మ నెమలి కంఠం చీర కట్టుకుని, చేమంతి పూలు పెట్టుకుంది కదాని శరభయ్య దగ్గర కెళ్ళి నవ్వుతూ బుజం మీద చెయ్యేస్తే 'సయ్'న తాచు పిల్లల్లే లేచి 'అదొక్కటే తక్కువ మొకానికి... పచ్చి వోడికి సరసం కూడా?' అని ఛీ కొట్టేది. అప్పట్నించి రాత్రిళ్ళు గుళ్ళో జమ్మి చెట్టు కింద పడుకునేవాడు.

శరభయ్య తల్లీదండ్రీ పోతే కర్మలన్నా సక్రమంగా చెయనివ్వలేదు కాంతమ్మ. దాంతో శరభయ్యకి భార్యన్నా, బతుకన్నా విరక్తి కలిగింది. సన్యాసుల్లో కలుద్దామని ఓ అర్ధరాత్రి కాశీ పారిపోయొచ్చాడు.

అలా కాలినడకన భార్యని తిట్టుకుంటూ, బతుకుని తిట్టుకుంటూ కాశీ అయితే వచ్చాడు గానీ, కాశీ వచ్చినప్పటి నుంచి ధ్యాసంతా కాంతమ్మ మీదే. అది నెమలి కంఠం చీర కట్టుకుందో లేదో? వాలుజడ వేసుకుందో లేదో, అంటూ పెళ్ళాం గురించి తలపులు. అటు సంసారం కుదరక, ఇటు సన్యాసుల్లో కలవలేక కొట్టుమిట్టాడుతూ, ఓ బైరాగుల మఠంలో చేరాడు శరభయ్య. ఓ మఠం నుంచి ఇంకో మఠం మారుతూ కొన్నేళ్ళు గడిపాడు. కాషాయం కట్టాడుకాని, కాంతమ్మని గురించిన ఆలోచనలు తగ్గలేదు. పోనీ ఇంటికెళ్ళి కాపురం చేద్దామా అంటే ఆ ధైర్యం లేదు. కొంత కాలానికి ఓ దయగల సేఠ్ ఒకడు ''ఎంత కాలం ఈ బైరాగుల మఠాల్లో పడి తింటావు?'' అని ఓ అన్నపూర్ణ కావిడి తన పేరన దానమిచ్చి వూరూరూ అడుక్కు తినమని పంపించాడు. అప్పటి నుంచి కావిడి భుజాన వేసుకుని వూరూరూ తిరుగుతూ ఒక్కసారి కాంతమ్మని చూడాలన్న ఆత్రుతతో అమరావతి పరుగెత్తుకొచ్చాడు.

శరభయ్య తిరిగి వచ్చేసరికి కాంతమ్మ ఈ లోకం వదిలి వెళ్ళిపోయింది. అన్నపూర్ణ కావిడే శరణ్యమయింది. నిజమైన వైరాగ్యం అప్పుడు కుదిరింది శరభయ్యలో. అందరికీ పెట్టి తను తృప్తిగా వస్తులుండేవాడు. ఆఖరి దశలో శరభయ్య తత్వాలు పాడలేకపోతే సిద్దయ్య అనే కుంటి బిచ్చగాడు సాయం పాడేవాడు. సిద్దయ్యకు గట్టిగా ఇరవై ఏళ్ళు లేవు. శరభయ్య అవసాన దశలో వుండగా సిద్దయ్య అడిగాడు ''తాతా! నీవు పోయిం తర్వాత నాకీ అన్నపూర్ణ కావిడివ్వవా?'' అని.

ఆ మాట విని శరభయ్య నవ్వి అన్నాడు ''పిచ్చోడా! అన్నపూర్ణ లాంటి పెళ్ళాన్ని కోరుకోవాలి కాని అన్నపూర్ణ కావిడి కోరుకుంటావేరా? అన్నం పెట్టే ఆలిని కోరుకోవాలి కాని, అడుక్కుతినే పళ్లెం కావాలంటావేంరా?'' పాపం నిజమే అనుకున్నాడు సిద్దయ్య. శరభయ్య పోయాక అన్నపూర్ణలాంటి ఆలి కోసం వెతికాడు. కాని కుంటి సిద్దయ్యకు పిల్లనెవరిస్తారు? ఆఖరికి అడుక్కుతినే పళ్లెమే మిగిలింది.

ముత్యాలవాన